క్లుప్తంగా

180 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు: పోరంకిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం... కంకిపాడు మండలం కోలవెన్ను మాదాసువారిపాలెంకు చెందిన అన్నపనేని ప్రవీణ్‌కుమార్ తన బైక్ పై 180 కేజీల రేషన్ బియ్యం మూటలు కట్టి తరలిస్తూ పట్టుబడ్డాడు. ప్రశ్నించగా తెల్లకార్డుదారుల వద్ద కిలో రూ.10కి బియ్యం కొని మార్కెట్‌లో రూ.15కు అమ్ముతున్నట్లు చెప్పాడు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

బీటీ రోడ్డు నిర్మాణం



నున్న(విజయవాడరూరల్):నున్న గ్రామంలో పడమర ఎలిమెంటరీ స్కూల్ నుంచి పోలవరం కాల్వ వరకు రూ.37 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. తారు రోడ్డు నిర్మాణానికి అయ్యే వ్యయంలో ప్యూజన్స్ ప్రాజెక్ట్సు సంస్థ 50 శాతం నిధులను ప్రజావిరాళంగా చెల్లించగా మిగిలిన సగం నిధులు గ్రామ పంచాయతీ గ్రాంటు నుంచి ఖర్చు చేస్తున్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి డి.శ్రీనివాసరావు తెలిపారు. 560 మీటర్ల పొడవు, అయిదున్న మీటర్ల వెడల్పు కొలతలతో రోడ్డు నిర్మిస్తున్నట్లు ఏఈ ఎస్.శివరామకృష్ణ చెప్పారు.

అన్నదాత సుఖీభవ నిధులు ఒకేసారి జమచేయాలి

గన్నవరం:అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు పంట సాయంను ఒకేసారి రైతుల ఖాతాల్లో జమచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కొలుసు శ్రీమన్నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ...అన్నదాత సుఖీభవ నిధులు మూడు సార్లుగా జమ చేయడం వల్ల రైతుల వ్యవసాయ అవసరాలు తీరవన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే ఒకేసారి ఇవ్వడం వల్ల రైతులకు మరింత మేలు చేకూరుతుందని తెలిపారు. బ్యాంక్‌లు రైతులకు పూర్తిస్థాయిలో పంట రుణాలు మంజూరు చేయకపోవడం వల్ల అన్నదాలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వ్యవసాయ అవసరాలకు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి చివరికి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులు, కౌలుదారులకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరోగ్యంతోనే సరైన విద్య సాధ్యం



కంకిపాడు: సరైన విద్య ఆరోగ్యంతోనే సాధ్యమవుతుందని నవజీవన్ బాల భవన్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎండీ వసంతకుమారి తెలిపారు. కంకిపాడు బస్ పేట ఎస్టీ ఏరియాలో విద్య ఆరోగ్యం ఆవశ్యకతకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వసంతకుమారి మాట్లాడుతూ పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం విద్య పై అవగాహన పెంపొందిస్తూ స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నవజీవన్ సొసైటీ టీచర్ ఎం పెద్దింట్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళ నేతల అరెస్ట్‌పై ఖండన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచ సుందరి పోటీలను వ్యతిరేకించిన మహిళా సంఘాల నాయకుల అరెస్ట్, గృహ నిర్బంధాలను ఖండిస్తూ ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం జరిగింది. జాతీయ నాయకుల సంధ్యక్క అక్రమ అరెస్ట్‌ను మహిళా సంఘం నేతలు ఖండించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు పి.పద్మ మాట్లాడారు.

ఘనంగా తూనికలు, కొలతల దినోత్సవం

గుడివాడ టౌన్: ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం బులియనరి అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జైన్ మందిరంలో బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కృష్ణా జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రోలజీ టి. రాజేంద్రప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు ప్రతి సంవత్సరం సిఖా వేయించుకోవాలన్నారు. బంగారానికి ఒక మిల్లీగ్రాము, వెండికి 10 మిల్లీగ్రాములు వేరియేషన్ మించకుండా కాటాలు సరిచేసుకోవాలన్నారు. వీటిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సభ్యులందరూ ఎలక్ట్రానిక్ మిషన్ వాడుతున్నారో లేదో గమనించాల్సిన అవసరం స్థానిక అధికారులపై ఉందని అన్నారు. లీగల్ మెట్రాలజీ మచిలీపట్నం ఇన్‌స్పెక్టర్ ఎస్. ఈశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడు షా కీర్తికుమార్ జీవావత్, బోగాది మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బుడమేరు వంతెనకు మోక్షం దక్కేనా?

- వంతెన కూలి రెండేళ్లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పంట ఉత్పత్తుల చేరవేతకు అష్టకష్టాలు



మంతెన వద్ద శిథిలమైన బుడమేరుపై వంతెన

కంకిపాడు: భారీ వరదలతో బుడమేరుపై ఉన్న వంతెన కూలిపోయి ఇప్పటికే రెండేళ్లయింది. దీంతో రాకపోకలు సాగక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్లు గడుస్తున్నాయే తప్ప వంతెనకు మోక్షం దక్కటం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. మండలంలోని వేల్పూరు, ఉప్పలూరు, మంతెన తెన్నేరు పరిసరాల గుండా బుడమేరు ప్రవహిస్తుంది. మంతెన వద్ద రెండు కట్టలను కలుపుతూ వంతెన ఉంది. వంతెనకు ఆవలి వైపున సుమారు 1500 ఎకరాల్లో సాగు భూములు ఉన్నాయి. వరి, చెరకు, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. తరిగొప్పల, అజ్జంపూడి, కేసరపల్లి, మంతెన, తెన్నేరు, ఉప్పలూరు పరిధిలోని రైతాంగం ఇక్కడ సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

పంట పొలాల్లోకి సాగని రాకపోకలు....

రెండేళ్ల క్రితం బుడమేరుకు వచ్చిన వరదలతో వంతెన కూలిపోయింది. దీంతో ఈ మార్గం గుండా పంట పొలాల్లోకి రాకపోకలు సాగటం లేదు. అతికష్టం మీద ద్విచక్రవాహనదారులు శిథిలమైన వంతెన శకలాల మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ విధంగా రాకపోకలు సాగించిన క్రమంలో సుమారు 200 వరకూ ప్రమాదాలు జరగ్గా, 150 మంది వరకూ గాయపడినట్లు సమాచారం. పంట ఉత్పత్తులు, వ్యవసాయ పరికరాలు పొలం వద్దకు వెళ్లాలంటే మాత్రం ఆస్కారం లేదు. తెన్నేరు లేదా ఉప్పలూరు మీదుగా సుమారు 8–10 కిలో మీటర్లు ప్రయాణించి పంట పొలాల్లోకి చేరుకోవాల్సిన పరిస్థితి. కూలీలను చేర్చాలన్నా కూడా ఆటోలు, ట్రాక్టర్లలో చుట్టూ తిప్పుకుంటూ వెళ్లాల్సి వస్తుంది.

ఈ ఏడాది లేనట్టే....

వంతెన కూలటంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అధికారులు ప్రాథమికంగా అంచనాలను రూపొందించారు. రూ.2.50 కోట్లతో అంచనాలను తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. ఇంతలో ప్రభుత్వం మారింది. తదుపరి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బుడమేరు ఇవతలి కట్ట నుంచి అవతలి కట్టను తాకుతూ వంతెనను పూర్తి స్థాయిలో నిర్మించేందుకు అంచనాలను సిద్ధం చేయమంటే అధికారులు రూ.15 కోట్లతో పూర్తి అంచనాలను నివేదించారు. ప్రభుత్వ పరిశీలనలోనే ఈ వ్యవహారం ఉంది. నేటికీ కేటాయింపులు జరగలేదు. ప్రస్తుతం మే నెల గడుస్తోంది. ఇప్పటికిప్పుడు నిధులు కేటాయింపులు జరిగినా టెండర్లు పూర్తయి పనులు మొదలు పెట్టేసరికి వర్షాకాలం వచ్చేస్తుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఈ ఏడాదికి బుడమేరు వంతెన నిర్మాణం లేనట్టేనన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

అంచనాలు నివేదించాం

వంతెన అభివృద్ధికి రూ.2.50 కోట్లతో నివేదిక పంపాము. కట్ట నుంచి కట్టకు వంతెన నిర్మాణం చేసేందుకు రూ.15 కోట్లు అవసరం అవుతుందనే నివేదిక కూడా అందించాము. ఇప్పటి వరకూ నిధులు రాలేదు. వస్తే వెంటనే పనులు చేపట్టేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటాం.

– శ్రీనివాసమూర్తి, డ్రెయినేజీ ఏఈ, విజయవాడ

వంతెన అభివృద్ధి చేయాలి



వంతెన కూలి రెండేళ్లు అవుతోంది. శిథిలమైన వంతెన గుండానే వెళ్తున్నాం. ఎంతోమంది జారిపడి గాయపడ్డారు. ప్రజల ఇబ్బందులను పాలకులు గుర్తించి వంతెన అభివృద్ధి చేస్తే బుడమేరు పరిధిలో కూలీ పనులు చేసుకునేందుకు పడుతున్న ఇబ్బందులు తీరుతాయి.

– మల్లవరపు రాజేష్, మంతెన

ఖర్చులు అదనంగా అవుతున్నాయి



బుడమేరు కట్ట వెంబడి ఐదారు గ్రామాలకు చెందిన సుమారు 1500 ఎకరాల భూములు ఉన్నాయి. పొలాల్లోకి వెళ్లటానికి వంతెన ఒక్కటే ఆధారం. లేకపోతే చుట్టూ తిరిగి వెళ్లాలి. దీనివల్ల సాగు ఖర్చులు అదనం అవుతున్నాయి. యుద్ధప్రాతిపదికన వంతెనను అభివృద్ధి చేస్తే సమస్య తీరుతుంది.

– లావు ప్రసాద్, రైతు, మంతెన

సమ్మె విజయవంతం చేయాలని ర్యాలీ



పెనమలూరు:ఈ నెల 20వ తేదీన కార్మికులు, రైతులు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని, సీఐటీయు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, సీపీఎం మండల కార్యదర్శి షేక్.కాశిం పిలుపునిచ్చారు. పోరంకి మానికొండ సుబ్బారావు, సూర్యావతి సీఐటీయు కార్యాలయం వద్ద నుంచి బుధవారం పలు గ్రామాల్లో బైక్ ర్యాలీ చేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ సమ్మెకు కార్మికులు పూర్తి మద్దతు పలకాలని కోరారు. కార్మికుల హక్కులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ధ్వజమెత్తారు. దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు, రైతులు పాల్గొని సమ్మెతో ప్రభుత్వ కళ్లు తెరిపించి నల్ల చట్టాలు రద్దు చేసే విధంగా పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు అక్కిదాసరి డేవిడ్, వెంకటరెడ్డి, ఆర్.వేణు, సురేష్, సీహెచ్.దుర్గాప్రసాద్, పలుసంఘాల నేతలు పాల్గొన్నారు.

చెత్త కుప్పలు తొలగింపు

రామవరప్పాడు: రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో చెత్త కుప్పలను బుధవారం తొలగించారు. ఈ నెల 13న 'వీధుల్లోనే చెత్త కుప్పలు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మార్గంలో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా వీటిని తొలగించటం లేదు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు స్పందించి చెత్త కుప్పలు తొలగించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



పురుషోత్తపట్నంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



ముస్తాబాదలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



వణుకూరు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాల ఔన్నత్యంపై, ప్రతి గ్రామంలో ఉండవలసిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి చదవటం మాకిష్టం, గ్రంథాలయానికి పోదాం, పుస్తక పఠనంతో ఎదుగుదాం అంటూ నినాదాలు చేశారు. కృపానందం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెల్లడికి సమ్మర్ క్యాంపులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలోని సమ్మర్ క్యాంపులో విద్యార్థులు చిత్రలేఖనం పోటీల పాల్గొన్నారు. కథలు చదివి వినిపించారు. లైబ్రేరియన్ జ్యోతికుమారి ఆధ్వర్యంలో విజేతలను ఎంపిక చేసి అభినందించారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

పెనమలూరు:వణుకూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు జోరుగా జరుగుతున్నాయి. గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి తోక కథలు చెప్పించారు. అనంతరం విద్యార్థుల్లో మానసిక ఆనందం కలిగించటానికి డ్యాన్స్, ఆటల పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో 36 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యం విశిష్టతపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్:బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరంలో బుధవారం విద్యార్థులకు తెలుగు సాహిత్యం, పద్యాలు, రచయితలు, కవుల గురించి పరిచయం చేశారు. వికటకవి తెనాలి రామకృష్ణ జీవిత చరిత్ర, కథలతో పాటుగా పద్య పుస్తకాలను విద్యార్థులకు అందించి చదివించారు. అంతేకాక కథలు చదవటం ద్వారా తెలుసుకున్న నీతి గూర్చి విద్యార్థులతో మాట్లాడించారు. తెనాలి రామకృష్ణ కథలు చదవటం వల్ల వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు అలవర్చుకోవచ్చని గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి విద్యార్థులకు వివరించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరటానికి పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. అనంతరం క్రీడలు, నృత్య శిక్షణ నిర్వహించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

గన్నవరం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్స్‌పై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు చిమట రామారావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలో పఠనాభిలాషను పెంపొందించాలని చెప్పారు. దీనివల్ల పిల్లల్లో విజ్ఞానం, మేధోశక్తి పెరుగుతుందన్నారు. ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించాలి

కంకిపాడు: విద్యార్థులు పఠనాశక్తి పెంపొందించాలని పలువురు వక్తలు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. కంకిపాడు శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు, పుస్తక పఠనంలో శిక్షణ ఇచ్చారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. గ్రామ పెద్ద దేవినేని మధుసూదన్‌రావు చిన్నారులకు కథలు చెప్పి, అందులో నీతిని వివరించారు. డి. లక్ష్మి విద్యార్థులకు మంచి చెడులను వివరించారు. గ్రంథాలయాధికారి ఎస్. సునీత శిబిరాన్ని పర్యవేక్షించారు.



కంకిపాడు గ్రంథాలయంలో పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు



తెన్నేరు గ్రంథాలయంలో అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు



గన్నవరంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ట



ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై ఆరాధిస్తున్న డాక్టర్ శర్మిష్ట

కంకిపాడు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ట ఆదేశించారు. ఉప్పలూరు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఓపి వివరాలను వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రికను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు మెరుగ్గా అందేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో ఉండే క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. తనిఖీలో వైద్యాధికారులు డాక్టర్ అంజు, డాక్టర్ సాయి నికిత, ఎంపి హెచ్ ఈ ఓ కష్టారావు, పిహెచ్ఎన్ రాజమణి, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల స్వామిభక్తిపై విమర్శల వెల్లువ



వైన్‌షాపు కోసం చేస్తున్న నిర్మాణాలు



వైన్‌షాపు రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ చేయడంతో పాటు ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో టీడీపీ నేతల సిండికేట్‌కు చెందిన మద్యం దుకాణం ఏర్పాటుకు అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయడం చర్చనీయాంశంగా మారింది. వైన్‌షాపునకు వెళ్లే మార్గంలో జంగిల్ క్లియరెన్స్ చేయించడంతో పాటు విద్యుత్ లైన్లు వేసి వీధి దీపాలను ఏర్పాటు చేసి అధికారులు స్వామిభక్తిని చాటుకున్నారు. టీడీపీ నేతల సిండికేట్‌కు చెందిన మర్లపాలెం పరిధిలోని వైన్‌షాపును కేసరపల్లి ఏలూరు కాలువ వంతెనకు సమీపంలోకి మార్చేందుకు పంట పొలాన్ని లీజుకు తీసుకున్నారు. అక్కడ వైన్‌షాపుతో పాటు మందుబాబులు కూర్చొని తాగేందుకు వీలుగా దాబా హోటల్ ఏర్పాటుకు నిర్మాణ పనులు ప్రారంభించారు. వైన్‌షాపునకు విద్యుత్ సరఫరా నిమిత్తం స్థల యాజమని పేరుతో దరఖాస్తు చేసిన రోజుల వ్యవధిలోనే విద్యుత్ స్తంభాలను ఆ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కేసరపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి అయితే స్వీయ పర్యవేక్షణలో పెద్దగా వినియోగంలో లేని వైన్‌షాపునకు వెళ్లే రహదారిపై జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించారు. గ్రామపంచాయతీ నిధులతో పొక్లెయిన్‌ను ఏర్పాటు చేసి మొక్కలు, వ్యర్థాలను తొలగించి సుందరంగా తీర్చిదిద్దారు. అంతే కాకుండా కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. గ్రామంలోని బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతుంటే పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి వైన్‌షాపు మార్గంలో గంటల వ్యవధిలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి



అన్నమయ్య సంకీర్తనలు గానం చేస్తున్న బృంద సభ్యులు

విజయవాడకల్చరల్: అన్నమయ్య సంకీర్తనా గాన ప్రచార భక్త బృందం ఆధ్వర్యంలో ముత్యాలంపాడులోని శ్రీ పట్టాభిరామ స్వామి దేవాలయ సముదాయంలో బుధవారం అన్నమయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసులు కసూర్తి గోపాలరావు అన్నమయ్య రచించిన సంకీర్తనలు వినరో భాగ్యము, అంతయు నీవే, చిన్ని శిశువు తదితర సంకీర్తలను మధురంగా ఆలపించారు. సంస్థ నిర్వాహకుడు పప్పు సదాశివ శాస్త్రి నిర్వహించారు.

శ్వాస ఆధ్వర్యంలో..

అన్నమయ్య సంకీర్తనా అకాడమీ, కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నామాచార్యుల 617వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు మధురంగా సాగుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో హరిద్రా మ్యూజిక్ అకాడమీ బృంద సభ్యులు, మల్లాది అభిజ్ఞ, మల్లాది అనన్య, చెంగల్వల రంజని, మునుకుట్ల యశ్విని, కేవీ బ్రహానందం అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ మాగంటి వేణుగోపాల్, కార్యనిర్వాహకుడు సీహెచ్ రామ్మోహనరావు, మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

ఘనంగా పునీత జోజప్ప ఆలయ వార్షికోత్సవం



దివ్యపూజాబలిలో పాల్గొన్న ఫాదర్లు

తుట్టగుంట(గన్నవరం):ఉంగుటూరు మండలం తుట్టగుంట గ్రామంలో పునీత జోజప్ప ఆర్‌సీఎం దేవాలయం ప్రథమ వార్షిక వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెవరెండ్ ఫాదర్ అవినాష్ పరిశుద్ధ దివ్యపూజాబలిని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...ప్రజలంతా ఐక్యతా భావంతో మెలగాలని చెప్పారు. అతి చిన్న గ్రామమైన తుట్టగుంటలో ఇంతటి ఆలయ నిర్మాణం చేయడం అభినందనీయమని పెద్దఆవుటపల్లి విచారణ గురువులు ఫాదర్ అభిలాష గోపు తెలిపారు. చర్చి నిర్మాణానికి కారకుడైన గుడిసె బాలస్వామి కృషి మరువలేనిదని చెప్పారు. అనంతరం బాలస్వామి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు నేతృత్వంలో భక్తులకు ప్రత్యేక విందు ఇచ్చారు. సాయంత్రం మరియమాత స్వరూపంతో తేరు ఊరేగింపు నిర్వహించారు. ఫాదర ఏసుపాదం, ఫాదర్ సుధీర్, సంఘ పెద్దలు పిల్లి ఏసుపాదం, చిన్నం డేవిడ్, చింతలపూడి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కి 60 యూనిట్ల రక్తదానం

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేవుని సంఘం ప్రపంచ పరిచర్య సంస్థ చైర్మన్ పాస్టర్ కిమ్ జుచ్యోల్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో హోటల్ కొనల వద్ద నిర్వహించిన శిబిరంలో 60 మంది ఆ సంఘ విశ్వాసులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని ఏసీపీ ప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం, వర్గం అనే బేధం లేకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

ఎంబీ విజ్ఞాన కేంద్రంలో కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో మాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. గత నెల రోజులుగా విజ్ఞాన కేంద్రంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న 100 మంది విద్యార్థులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎంబీ విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి బీఆర్ తులసీరావు ప్రారంభించి మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌లకు, టీవీలకు ఎడిక్ట్ అవుతున్న పిల్లలకు చిన్న వయసులోనే కళ్లజోళ్లు వేసుకునే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కంటి సమస్యలు రాకుండా సరైనాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంబీ విజ్ఞాన కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు టి.క్రాంతికిరణ్, వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదికకు రూ. లక్ష విరాళం



విరాళం నగదు అందజేస్తున్న ప్రసాద్ దంపతులు

గన్నవరం:స్థానిక పాతగన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేదికకు బుధవారం భక్తులు రూ. లక్ష విరాళం ఇచ్చారు. గన్నవరానికి చెందిన నర్రా ప్రసాద్, భ్రమరాంబ దంపతులు రూ. 50 వేలు, ఆయన కుమారుడు నర్రా మనీష్‌చౌదరి మరో రూ. 50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. భక్తులందరి సహాయ, సహకారాలతో శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదికను పూర్తిచేసినట్లు శ్రీధర్ తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ వంతు తోడ్పాటునందించిన భక్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.